బాధిత కుటుంబాలకు పరామర్శ

జడ్చర్లలో బస్మమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి

జడ్చర్ల/మూసాపేట, డిసెంబర్ 16 : జడ్చర్ల మున్సిపాలిటీలోని శ్రీనివాస్ కాలనీకి చెందిన చిన్నబస్మమ్మ(75) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి బస్మమ్మ ఇంటికి వెళ్లి ఆమె పార్థివదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదేవిధంగా జడ్చర్ల మున్సిపాలిటీకి చెందిన సంతోష్ చారి మాతృమూర్తి అనారోగ్యంతో ఆదివారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి సంతోషిచారి ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే మూసాపేట మండలం దాసరిపల్లికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు రవివర్ధన్ వదిన పద్మ అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం ఆకస్మికంగా మృతి చెందింది. విషయం తెలుసుకున్న దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి గ్రామానికివెళ్లి పద్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అమె మృతి పట్ల సానూభూతి తెలియజేస్తూ, రవివర్ధన్‌తోపాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాజీ మంత్రి వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ పుష్పలత, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రఘుపతిరెడ్డి, కౌన్సిలర్లు లత, రఘురాంగౌడ్, ముడా మాజీ డైరెక్టర్లు ఇంతియాజ్‌ఖాన్, శ్రీకాంత్, మురళి, ఆంజనేయులు, రవినాయక్, నాగిరెడ్డి, నర్సింహులు, పర్మటయ్య, దానిశ్, మసియోద్దీన్ ఉన్నారు.

మూసాపేట : పద్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

ముగిసిన గ్రూప్-2 పరీక్షలు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం : వివరాలు సేకరిస్తున్న మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిరబోయి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, డిసెంబర్ 16 : ఈనెల 15 నుంచి ప్రారంభమైన గ్రూప్-2 పరీక్షలు సోమవారం సజావుగా ముగిశాయి. మల్టీజోన్-2 ఐజీ సత్యనారాయణ మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలను సందర్శించారు. పోలీసు భద్రతా ఏర్పాట్లు, పరీక్షా కేంద్రాల నిర్వహణ, అభ్యర్థుల వివరాలు పరిశీలించారు. కలెక్టర్ విజయేందిరబోయి, ఎస్పీ జానకి పరీక్ష కేంద్రాలు తనిఖీ తోపాటు కేంద్రాలను పర్యవేక్షించారు. అధికారులు ముందస్తు జాగ్రత్తలు చేపట్టడంతో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోలేదు. మొదటి రోజు జిల్లాలో 50.42శాతం హాజరు నమోదు కాగా.. రెండో రోజు సైతం అదే తరహాలో హాజరు నమోదు అయ్యింది. రెండో రోజు సైతం సగం మందే అభ్యర్థులు పరీక్ష రాశారు. జిల్లా కేంద్రం మెట్టుగడ్డలోని ప్రభుత్వ డైట్, బీఈడీ కళాశాలల్లోని పరీక్షా కేంద్రాలను, ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ఎంపీఎస్, ఎన్టీఆర్ ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలల్లోని పరీక్షా కేంద్రాలను కలెక్టర్, ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అభ్యర్థుల హాజరు వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోలీసు భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.

నారాయణపేటలో..

నారాయణపేట టౌన్, డిసెంబర్ 16 : పట్టణంలో రెండు రోజులుగా జరిగిన గ్రూప్-2 పరీక్ష సోమవారం ప్రశాంతంగా ముగిసింది. సోమవారం ఉదయం సెషన్‌లో జరిగిన పరీక్షకు మొత్తం 3,994 మంది అభ్యర్థులకు గానూ 2,015 మంది హాజరయ్యారు. 1,979 మంది గైర్హాజరయ్యారు. 50.45 హాజరు శాతం నమోదయింది. మధ్యాహ్నం సెషన్‌లో మొత్తం 3,994 మంది హాజరవ్వాల్సి ఉండగా 2,016 మంది హాజరు కాగా 1,978 మంది గైర్హాజరయ్యారు. 50.48 హాజరు శాతం నమోదైంది. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలోని పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ సిక్తాపట్నాయక్ సందర్శించారు. డీఎస్పీ లింగయ్య పలు పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు పర్యవేక్షించి సిబ్బందికి సూచనలు చేశారు.

పరీక్షా సరళిని పరిశీలిస్తున్న నారాయణపేట కలెక్టర్ సిక్తాపట్నాయక్

మక్తల్ పట్టణంలో డయాలసిస్ సెంటర్ లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారని, ఏర్పాటుకు కేంద్రం చొరవ చూపాలని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి సోమవారం వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు వినతిపత్రం అందజేశారు. ఇందుకు మంత్రి స్పందించి.. వీలైనంత త్వరగా సెంటర్‌ను ప్రారంభిస్తామని భరోసా ఇచ్చారు. *- ఊట్కూర్, డిసెంబర్ 16*

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చాలి

- కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్ అర్బన్, డిసెంబర్ 16 : జిల్లాస్థాయి పోటీల్లో విజయం సాధించిన వారు రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ ప్రతిభ కనబర్చాలని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న సీఎం కప్ పోటీలను డీఎస్‌వో శ్రీనివాస్‌తో కలిసి ఆమె ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులో ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ప్రభుత్వం సీఎం కప్ పోటీలు నిర్వహిస్తుందన్నారు. మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డికు క్రీడలపై ఎంతో ఆసక్తి ఉందని, జిల్లా క్రీడాకారులు క్రీడాలో ఉన్నతంగా రాణిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయికి తీసుకువేళ్లేందుకు వారి సహకారం ఉంటుందన్నారు. అనంతరం డీఎస్‌వో శ్రీనివాస్ మాట్లాడుతూ సోమవారం జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలు ఈనెల 20వ తేదీ వరకు జరుగుతాయన్నారు. గ్రూప్-2 పరీక్షల కారణంగా సోమవారం జరగావల్సిన కొన్ని క్రీడలను మంగళవారం నుంచి కొనసాగిస్తామన్నారు. జిల్లా కేంద్రంలోని స్టేడియం మైదానంలో జరిగిన సీఎం కప్ పోటీలు ఆదివారం అట్టహాసంగా నిర్వహించారు. మొదటి రోజు ఖోఖో, నెట్‌బాల్, బేస్‌బాల్, సాఫ్ట్‌బాల్, కిక్ బాక్సింగ్, కబడ్డీ, బాస్కెట్‌బాల్‌కు పోటీలు నిర్వహించగా 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు. గెలుపొందిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. నెట్ బాల్ బాలుర విభాగంలో హన్వాడ జట్టుపై మహబూబ్‌నగర్ జట్టు క్రీడాకారులు గెలుపొందగా.. మహబూబ్‌నగర్ రూరల్ మూడోస్థానంలో నిలిచింది. బాలికల విభాగంలో మహబూబ్‌నగర్ రూరల్‌పై మహబూబ్‌నగర్ అర్బన్ గెలుపొందగా.. జడ్చర్ల భూత్పూర్ మూడోస్థానానికి పరిమితమయ్యారు. కార్యక్రమంలో గ్రంథాలయాల సంస్థ చైర్మన్ నర్సింహారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, సిరాజ్‌ఖాద్రీ, మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, సీఎం కప్ కోకన్వీనర్ సాధత్ ఖాన్, నెట్‌బాల్ రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు విక్రంకుమార్‌రెడ్డి, పెటా టీఎస్ రాష్ట్ర కార్యదర్శి నిరంజన్, జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్ గౌడ్, ఖోఖో ప్రధాన కార్యదర్శి విలియం, ఒలంపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్, వైస్ ప్రెసిడెంట్ జాకీర్, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శారదాబాయి, యోగ సంఘం జిల్లా కార్యదర్శి బాలరాజు, పాపరాయుడు, వేణుగోపాల్, నిరంజన్‌రావు, వడెన్న, అరుణజ్యోతి, పుష్ప, మేరి పుష్ప, భవ్యశ్రీ పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మె

- చెవిలో పువ్వులతో నిరసన దీక్ష

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, డిసెంబర్ 16 : సమగ్ర శిక్షా ఉద్యోగులకు సీఎం ఇచ్చిన హామీని వెంటనే నిలబెట్టుకోవాలని తపస్ రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతరావు డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన సమ్మె సోమవారం ఏడో రోజుకు చేరుకున్నది. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ధర్నా చౌక్‌లో ఎస్ఎస్ఏ ఉద్యోగులు చెవిలో పువ్వులతో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. తపస్ జిల్లా, రాష్ట్ర నాయకులు సమ్మెలో ఉన్న సిబ్బందికి సంఘీభావం తెలిపారు. ఎస్ఎస్ఏ ఉద్యోగులు చాలీచాలని వేతనాలతో నిత్యం అవస్థలు పడుతున్నారన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులతో సమానంగా పనిచేస్తున్నా.. వారికి చాలా తక్కువ జీతాలు ఉండడంతో శ్రమ దోపిడీకి గురవుతున్నారన్నారు. గతేడాది సీఎం సమగ్ర శిక్షా ఉద్యోగులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.

నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

వెంటనే రెగ్యూలరైజ్ చేసి విద్యాశాఖలో విలీనం చేయాలన్నారు. ఎస్ఎస్ఏ ఉమ్మడి జిల్లా ఉద్యోగ జేఏసీ అధ్యక్షుడు శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి ఇచ్చిన హామీలు నెరవేర్చడంతో పాటు సమస్యలు పరిష్కరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సునీల్, బాబునాయుడు, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, సుధాకర్, మధుసూదన్‌గౌడ్, అన్వర్‌బాషా, ఇక్రమ్, హరిత, గంగమ్మ, నాగలక్ష్మి, జగదీశ్, భాస్కర్, గీతారాణి, ఇందిరా, అనురాధ, శ్యామల, స్వాతి, అనిత, సునీత, మమత, శ్రీలత, మంజుల, రుక్మిణీబాయ్, భవాని పాల్గొన్నారు.

నారాయణపేటలో..

నారాయణపేట, డిసెంబర్ 16 : రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరవధిక సమ్మెలో భాగంగా పట్టణంలోని మున్సిపల్ పార్క్ వద్ద జిల్లాలోని సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె సోమవారం 5వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా సమగ్ర శిక్షా ఉద్యోగు లు చెవిలో పువ్వులు పెట్టుకొని వినూత్న రీతిలో నిరస న తెలిపారు. పలువురు ఉద్యోగులు మాట్లాడుతూ దశా బ్ద కాలంగా పని చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు కనీస వేతనానికి నోచుకోవడం లేదన్నారు. తమను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని, మహిళలకు ప్రత్యేక సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎల్లాగౌడ్, గౌరమ్మ, అల్తాఫ్, అన్వర్, రాజు, మనోహర్, నవీన్, అనిత తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచుల ముందస్తు అరెస్టు

జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌లో మాజీ సర్పంచులు

జడ్చర్ల, డిసెంబర్ 16 : అసెంబ్లీ సమావేశాల సందర్భంగా సర్పంచుల పెండింగ్ బిల్లులపై అసెంబ్లీ కార్యదర్శికి వినతిపత్రాన్ని ఇవ్వడానికి బయలుదేరిన మాజీ సర్పంచులను పోలీసులు ఎక్కడిక్కడే అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. జడ్చర్ల మండలానికి చెందిన మాజీ సర్పంచులను పోలీసులు ఉదయాన్నే అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచులు మాట్లాడుతూ సర్పంచుల పెండింగ్ బిల్లుల చెల్లింపుపై అసెంబ్లీ కార్యదర్శికి వినతి పత్రం అందజేయడానికి సర్పంచుల సంఘం పిలుపు మేరకు జడ్చర్ల నుంచి హైదరాబాద్ వెళ్తుంటే పోలీసులు అడ్డుకుని అక్రమంగా అరెస్టు చేశారన్నారు. అక్రమ అరెస్టులతో సర్పంచుల ఉద్యమాన్ని అణచలేరన్నారు. సోమవారం సర్పంచుల సమస్యపై చర్చ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్‌రావు సర్పంచుల సమస్యలపై గలమెత్తడంపై రాష్ట్ర సర్పంచుల తరపున ప్రణీల్‌చందర్ కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ పల్లెలకు గుర్తింపు తెచ్చిన సర్పంచులకు పెండింగ్ బిల్లులు చెల్లించక, రాష్ట్ర వ్యాప్తంగా సర్పంచులను నానా ఇబ్బందులు పెడుతున్న ప్రభుత్వాన్ని అసెంబ్లీ సాక్షిగా నిలదీసి మాజీ సర్పంచులకు అండగా నిలబడిన ప్రతిపక్షానికి, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. అరెస్టు అయిన వారిలో మాజీ సర్పంచులు ప్రణీల్‌చందర్, ప్రభాకర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌దవ్, రామకృష్ణారెడ్డి, నర్సింహులు, సుకన్య, వెంకట్‌రెడ్డి, సంగీతమల్లేశ్, ఆంజనేయులు, దీపక్‌రాథోడ్, శ్రీనివాస్, జంగయ్య ఉన్నారు.

క్రీడల్లో నారాయణపేటకు జాతీయ స్థాయిలో గుర్తింపు

క్రీడా జ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్

నారాయణపేట టౌన్, డిసెంబర్ 16 : క్రీడల పరంగా నారాయణపేటకు జాతీయ స్థాయిలో గుర్తింపు ఉందని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. సోమవారం పట్టణంలోని మినీ స్టేడియంలో సీఎం కప్ 2024 జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు అట్టహాసంగా జరిగాయి. కలెక్టర్ సిక్తాపట్నాయక్ క్రీడాజ్యోతిని, జెండాను ఆవిష్కరించి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ, మండల స్థాయి పోటీల్లో గెలిచిన వారికి జిల్లా స్థాయిలో సోమవారం పోటీలు జరుగుతున్నాయని, ఇక్కడ గెలిస్తే రాష్ట్ర స్థాయి పోటీలకు వెళ్తారని తెలిపారు. అంతకుముందు క్రీడాకారులచే గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ విజయ్‌కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ శివారెడ్డి, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి నర్సింహులు, డీపీఆర్‌వో రషీద్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మహ్మద్ ఖలీల్, పీఈటీలు రమణ, సాయినాథ్, అక్తర్ పాషా, వెంకటేశ్, పారిజాత, అనంతసేన పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలు తనిఖీ

పట్టణ శివారులో ఉన్న డీఎంహెచ్‌వో, డీఆర్డీవో కార్యాలయాలను సోమవారం కలెక్టర్ సిక్తాపట్నాయక్ తనిఖీ చేశారు. ముందుగా డీఎంహెచ్‌వో కార్యాలయాన్ని సందర్శించి అటెండెన్స్ రిజిస్టర్‌ను పరిశీలించారు. అక్కడ ఉన్న సిబ్బందితో వారి హోదా, చేసే పని వివరాలు అడిగి తెలుసుకున్నారు. డీఎంహెచ్‌వో కర్ని పీహెచ్‌సీలో విజిట్‌కు వెళ్లిందని, కొంత మంది డిప్యూటేషన్‌పై వెళ్లారని, మరికొంత మంది గ్రూప్-2 పరీక్ష రాసేందుకు వెళ్లినట్లు అక్కడి సిబ్బంది తెలియజేశారు. అలాగే డీఆర్డీవో కార్యాలయాన్ని తనిఖీ చేశారు.

సర్వేను పారదర్శకంగా చేపట్టాలి

నారాయణపేటరూరల్, డిసెంబర్ 16 : ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పారదర్శకంగా, పకడ్బందీగా చేపట్టాలని పేట కలెక్టర్ సిక్తాపట్నాయక్ అన్నారు. సోమవారం మండలంలోని జాజాపూర్‌లో కొనసాగుతున్న ఇండ్లసర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆమె వెంట ఎంపీడీవో సుదర్శన్, ఈడీఎం విజయ్ తదితరలు పాల్గొన్నారు.

కలుషిత జలాలను అరికట్టే చర్యలు తీసుకోవాలి

- అసెంబ్లీలో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదు
- జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల, డిసెంబర్ 16 : జడ్చర్ల మండలంలోని ఫార్మాసెజ్‌లోని అరబిందో ఫార్మా కంపనీలో కలుషిత వ్యర్థ జలాలను ముదిరెడ్డిపల్లి చెరువులోకి వదులు తున్నారని, దానిని అరికట్టాలని అసెంబ్లీలో ఫిర్యాదు చేసినప్పటికీ కలుషిత జలాలను అలాగే వదులుతున్నారని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అసెంబ్లీలో ప్రశ్నించారు. సోమవారం అసెంబ్లీ సమావేశాల్లో అనిరుధ్‌రెడ్డి పోలేపల్లి సెజ్‌లోని అరబిందో ఫార్మా కంపెనీ ముదిరెడ్డిపల్లి చెరువులోకి కాలుష్య జలాలను వదులుతున్నందున పంటలు దెబ్బతింటున్నాయన్నారు. అదేవిధంగా చెరువులోకి వదులుతున్న కలుషిత నీరు కారణంగా చెరువులోని చేపలు మరణిస్తున్నాయని, పంటలు దెబ్బతింటున్నాయని, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాలుష్య మండలి పరిశ్రమల కాలుష్యాన్ని నియంత్రించడానికి రూపొందించిన నిబందనలల్లో 90శాతం అమలు చేసినా కలుషిత జలాల సమస్య పరిష్కారమవుతుందని ఎమ్మెల్యే అన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మూసాపేట, డిసెంబర్ 16 : మండలంలోని విభా పరిశ్రమ సమీప జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరోకరు గాయాలైన ఘటన చోటుచేసుకున్నది. స్థానికుల కథనం మేరకు జానంపేటకు చెందిన శాంతయ్య(22), రాజశేఖర్‌లు మోటర్ సైకిల్‌పై మూసాపేట గ్రామానికి వచ్చి తిరిగి జానంపేటకు వెళ్తున్నారు. వీభా పరిశ్రమ సమీపానికి వెళ్లగానే వెనకవైపు నుంచి గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో శాంతయ్యకు బలమైన గాయాలైకాగా అక్కడికి అక్కడే మృతి చెందాడు. రాజశేఖర్‌కు తీవ్ర గాయాలయ్యాయి.

క్షయవ్యాధితో అప్రమత్తంగా ఉండాలి

భూత్పూర్/మిడ్జిల్, డిసెంబర్ 16 : క్షయవ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని ఐఏఎస్ అధికారి సరోజ్‌కుమార్ కోరారు. సోమవారం పట్టణ పరిధిలోని అమిస్తాపూర్ ఆరోగ్య ఉపకేంద్రంలో క్షయవ్యాధికి సంబంధించి కేంద్ర బృందం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సహకారంతో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో రోజు, రోజుకు క్షయవ్యాధిగ్రస్తులు పెరిగిపోతున్నారు. క్షయవ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్సను ప్రారంభించాలని ఆయన కోరారు. ఇందుకు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పరీక్షాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరీక్షలకు భయపడి చేయించుకోకపోతే రోగం నయం కాదని ఆయన పేర్కొన్నారు. 128 మందికి పరీక్షలను నిర్వహించినట్లు తెలిపారు. అలాగే మిడ్జిల్ మండల కేంద్రంలోని రాణిపేటలో క్షయ నిర్మూలనకు నిక్షయ్ శిబిరం వంద రోజులు ఇంటెన్సివ్ క్యాంపెయిన్ నిర్వహించిన శిబిరాన్ని డాక్టర్ సరోజ్ కుమార్, డైరెక్టర్ జాతీయ ఆరోగ్య మిషన్ డాక్టర్ రాజేశం, రాష్ట్ర క్షయ నియంత్రణ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వంద రోజులు ఇంటెన్సివ్ క్యాంపెయిన్ విజయవంతానికి శక్తివంచన లేకుండా ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. రాష్ట్రాన్ని క్షయ రహితంగా మార్చేందుకు శాశ్వత నివారణ చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం క్షయ వ్యాధిగ్రస్తులకు మందులు, భోజన పదార్థాలు, ఆహార వస్తువులు ఉవ్వడం జరిగింది. కార్యక్రమంలో డబ్ల్యూహెచ్‌వో ప్రతినిధి మహేశ్, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో శ్రీధర్‌రెడ్డి, డాక్టర్ అబ్దుల్ రబ్బు, సీహెచ్‌వో అయూబ్‌ఖాన్, క్షయవ్యాధి నివారణ పరిశీలకుడు రాజు, ఎల్‌టీ బాలరాజు, ఏఎన్ఎం కృపావతి, డాక్టర్ మహేశ్, జిల్లా క్షయ వ్యాధి నియంత్రణ అధికారి మల్లికార్జున్, జిల్లా ఉపవైద్య ఆరోగ్యాధికారి శ్రీధర్‌రెడ్డి, డాక్టర్ శివకాంత్, టీబీ నియంత్రణ బృందం, మిడ్జిల్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

భూత్పూర్ : వైద్య సిబ్బందితో కేంద్ర బృందం

మిడ్జిల్ : వైద్య శిబిరంలో పాల్గొన్న కేంద్ర వైద్య బృందం

వంట సామగ్రి నాణ్యతగా ఉండాలి

మాగనూరు, డిసెంబర్ 16 : వంట సామగ్రి నాణ్యతగా ఉండాలని జీసీడీవో పద్మనలిని, ఇన్‌చార్జి ఎంఈవో అనిల్‌గౌడ్ సూచించారు. మండలంలోని కేజీబీవీని సోమవారం వారు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంటగదిని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వంటలో వాడే పసుపు, కారం పొడి, అల్లం, నూనె, చింతపండు వంటి సామగ్రి నాణ్యతగా ఉండాలని సూచించారు. అనంతరం విద్యార్థినులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎస్‌వో రాధిక, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఫిర్యాదులు పరిష్కరించాలి

నారాయణపేట, డిసెంబర్ 16 : ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని ఎస్సీ యోగేశ్‌గౌతమ్ తెలిపారు. సోమవారం పట్టణంలోని ఎస్సీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఏడు ఫిర్యాదులు వచ్చాయి. భూ సమస్యలు కోర్టులో పరిష్కరించుకోవాలన్నారు.

నిధులు మంజూరు చేయాలి

భూత్పూర్, డిసెంబర్ 16 : కాంగ్రెస్ ప్రభుత్వం పెండింగ్ బిల్లును మంజూరు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం మాజీ సర్పంచులను ముందస్తుగా అరెస్ట్ చేయడంతో ఎవరు భయపడరని సర్పంచుల సంఘం మాజీ మండలాధ్యక్షుడు వెంకటయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న సందర్భంగా పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు ఆంజనేయులు, శేఖర్, యాదయ్య పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

మూసాపేట(అడ్డాకుల), డిసెంబర్ 16 : గ్రామ పంచాయతీ కార్మికుల ఉద్యోగ భద్రత కల్పించాలని కొరుతూ సోమవారం అడ్డాకుల ఎంపీడీవో కార్యాలయ పర్యవేక్షణ అధికారి శివప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ పిలుపు మేరకు మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న సిబ్బంది అడ్డాకుల ఎంపీడీవో కార్యాలయానికి చేరుకున్నారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు, వేతనం పెంచాలని, పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే ఇవ్వాలని పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో వెంకట్రాములు, రవిసాగర్, కురుమూర్తి, చంద్రయ్య, రాములు పాల్గొన్నారు.

లారీని ఢీ కొట్టిన బైక్

మాగనూరు, డిసెంబర్ 16 : ఆగి ఉన్న లారీని బైక్ ఢీకొట్టగా వ్యక్తికి గాయాలైన ఘటన మండలంలోని ఓబులాపూర్ గేటు సమీపంలో సోమవారం చోటు చేసుకున్నది. కానిస్టేబుల్ శివ కథనం మేరకు మండలంలోని గురురావు లింగంపల్లి గ్రామానికి చెందిన కుమ్మరి పవన్ కుమార్ మక్తల్ నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. మార్గమధ్యంలో ఓబులాపూర్ గేటు సమీపంలో మరమ్మతుల నిమిత్తం నిలిపిన లారీని వెనుక నుంచి ఢీకొట్టడంతో పవన్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు మక్తల్‌కు తీసుకెళ్లారు. అక్కడ వైద్యుడు మణికంఠగౌడ్ రెఫర్ మేరకు మహబూబ్‌నగర్‌కు తరలించారు. ప్రమాదంపై ఫిర్యాదు అందలేదని ఎస్సై అశోక్‌బాబు తెలిపారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా, Faisal Bin Abu Bakar Bawazeer S/o Abu Baker Bawazeer, aged 53 years, Occ: Business R/o H.No. 1-10-61/7, Shashab Gutta, Mahabubnagar **Applicant / Borrower / Property holder** నా క్లయింట్ అయిన శ్రీరాం ఫైనాన్స్ లిమిటెడ్, మహబూబ్‌నగర్ బ్రాంచ్-2 గారికి ఇట్టి ఆస్తిని తనఖా (Mortgage) పెట్టి అప్పు తీసుకోవటానికి దరఖాస్తు చేసియున్నారు. ఇట్టి ఆస్తి విషయములో ఎవరికైనా ఎలాంటి హక్కుగాని, ఆక్షేపణలు గాని ఉన్నయెడల ఈ క్రింది అడ్రస్సుకు (3) రోజుల లోపల తెలియజేయగలరు. లేని పక్షంలో ఇట్టి ఆస్తిపై ఎలాంటి అభ్యంతరములు లేవని భావించి నా క్లయింట్ అయిన శ్రీరాం ఫైనాన్స్ లిమిటెడ్, మహబూబ్‌నగర్ బ్రాంచ్-2 వారు షెడ్యూల్ ఆస్తిని తనఖా పెట్టుకొని అప్పును మంజూరు చేయుదురు. తరువాత వచ్చిన ఆక్షేపణలు చెల్లనేరవు.

SCHEDULE OF THE PROPERTY:

All that the part and parcel of residential house plot No.90 total extent 150 sq.yards, in Sy.No.53/1/Gha, 53/1/Ga, 53/Ga, 53/1/A, 53/1/E, 53/1/EE, 53/1/AA, 3/1/Ye, 53/1/Yye, 53/1/Vu, 53/1/Vu/A, 53/1/La, 53/1/Lu, 53/1/Ra, 53/1/Kha, 53/1/Ru,53/1/Kha/AA, 53/1/Ka/Kha, 53/2/Lu & 53/2/Voo situated within the limits of Bureddypally Village, Jadcherla Mandal, Mahabubnagar Dist.
Bounded by: East: Plot No.89, **West:** 25ft Road, **North:** Plot No.91, **South:** 30 ft road.

K. CHANDRA MOULI, B.Com., LLB
Advocate, New Gunj, Hanuman Nagar, Mahabubnagar. Cell: 9440330760

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా, Smt. K.Nagajyothi D/o Katike Amjoji, W/o K. Raju, aged 32 years, Occ: House hold, R/o H.No. 1-7-238/13/A/1, TD Gutta, Mahabubnagar. **Applicant / Borrower / Property holder** నా క్లయింట్ అయి